Office Of The Advisor (communications)
Govt. Of Andhra Pradesh

# ఏపీ ఆతిథ్యానికి కొత్త ఊపు

## 25 వేల హోటల్ గదుల ఏర్పాటుకు ‘ఓయో’ సంసిద్ధత

## గ్రామీణ, ఆలయ, జల క్రీడా పర్యాటకంలో భాగస్వామ్యం

అమరావతి, మే 26 : రాష్ట్ర ఆతిధ్య రంగంలో మరో ముందడుగు పడింది. ఒక సంవత్సరం వ్యవధిలో 25 వేల హోటల్ గదులను సిద్ధం చేసేందుకు ప్రముఖ ఆతిధ్య సంస్థ ‘ఓయో’ ముందుకొచ్చింది. శనివారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసిన ఓయో వ్యవస్థాపకుడు రితేష్ అగర్వాల్ రాష్ట్రంలో పర్యాటక రంగం, ఆతిధ్య అభివృద్ధి అవకాశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి సూచనతో అత్యాధునిక సాంకేతికతను ప్రవేశపెట్టి రాష్ట్ర ఆతిధ్య రంగాన్ని శీఘ్రగతిన అభివృద్ధి చేసే సారధ్య బాధ్యతను చేపట్టేందుకు ఓయో వ్యవస్థాపకుడు అంగీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో భారీ సంఖ్యలో హోటల్ గదుల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అంగీకరించారు.

ఆకుపచ్చని భూభాగం, ఆకర్షణీయ తీర ప్రాంతం, పుష్కలమైన సహజ నీటి వనరులు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఆతిధ్య రంగం అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఈ రంగంలో రాబోయే 10 సంవత్సరాలలో కనీసం లక్ష హోటల్ గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి ఆయనకు వివరించారు. రాష్ట్రంలో నదులు, జలాశయాలు, జల వనరులు పుష్కలంగా ఉన్నందున క్రీడా పర్యాటకానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పరు. వినోదం, కొనుగోళ్లు, జల క్రీడలు, విలాసవంతమైన విడిది గృహాలు, విహంగ క్షేత్రాలు, ఆలయ, గ్రామీణ, వ్యవసాయ పర్యాటకాల అభివృద్ధితో ఆంధ్రప్రదేశ్‌లో చక్కటి వాతావరణాన్ని సృష్టించాలన్నదే తన ప్రయత్నమని అన్నారు. పదేళ్ల వ్యవధిలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ గమ్యస్థానంగా మార్చడమే ధ్యేయమని చెప్పారు. గ్రామీణ, క్రీడా, ఆలయ పర్యాటక రంగాల అభివృద్ధిలో ముఖ్య భూమిక వహించడానికి ఓయో ముందుకు రావాలని ముఖ్యమంత్రి కోరారు.

ఆయా ప్రాంతాలకు ఉన్న సాంస్కృతిక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆతిధ్య రంగాన్ని అభివృద్ధి చేయాల్సి వుందని అగర్వాల్ చెప్పారు. ఏపీలో క్లస్టర్ వారీగా పనిచేయడానికి ఆసక్తి కనబర్చారు. హోటల్ రిజిస్టర్లను డిజిటైజ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని కోరుతున్నట్టు చెప్పారు. అతిధుల రాకపోకల నమోదు వ్యవహారాలలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయటానికి ఓయో తగిన వనరులతో వస్తోందని తెలిపారు. విజయవాడ, విశాఖ, తిరుపతి, నెల్లూరు నగరాలలో తమ సంస్థ ఇప్పటికే నాణ్యమైన సేవలను అందిస్తున్నదని చెప్పారు. ఆతిధ్య రంగంలో సరసమైన ధరలలో లివింగ్ స్పేస్ అందించే సంస్థగా తమకు మంచి పేరున్నదని గుర్తుచేశారు.